AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

WWW.AKSHARATODAYNEWS.COM

6-7-2026 (Monday) MAIN EDITION


## వక్ఫ్ బోర్డులో హిందువులకు చోటు..




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** మధ్యప్రదేశ్ ప్రభుత్వం వక్ఫ్ బోర్డు నిర్వహణలో సరికొత్త సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు కేవలం ముస్లిం ప్రతినిధులు మాత్రమే ఉండే ఈ బోర్డులోకి, ప్రభుత్వం ఇప్పుడు హిందూ సభ్యులను కూడా నియమించింది. వక్ఫ్ బోర్డు నిర్వహణను మెరుగుపరచడం, ఆస్తుల వివరాలను పక్కాగా నమోదు చేయడం, చట్టపరమైన వ్యవహారాల్లో పారదర్శకతను పెంచడం కోసం ఈ మార్పులు చేసినట్లు మైనారిటీ సంక్షేమ శాఖ తెలిపింది. సబ్‌రిజిస్ట్రార్ స్థాయి అధికారి సజీవ్ శ్రీవాస్తవతో పాటు, మరికొందరు ముస్లిమేతర సభ్యులను బోర్డులోకి తీసుకున్నారు.

## ఏడు ఎకరాల వరకు రైతు భరోసా జమ




**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలోని రైతులకు రైతు భరోసా కింద ప్రభుత్వం నిధులను జమ చేస్తోంది. సోమవారం 7 ఎకరాల వరకు భూమి ఉన్న వారికి నిధులను విడుదల చేసింది. రైతు భరోసా కింద శనివారం వరకు ఆరు ఎకరాల్లోపు భూమి ఉన్న 67.44 లక్షల మంది రైతులకు ప్రభుత్వం రూ.7,135 కోట్లు జమ చేసింది. ఏడు ఎకరాల్లోపు భూమి ఉన్న 92,729 మంది రైతుల ఖాతాల్లో సోమవారం రూ.354.96 కోట్లు జమ చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

## నాంపల్లి కోర్టులో అగ్ని ప్రమాదం



అక్షరటుడే, హైదరాబాద్: హైదరాబాద్ నగరంలోని నాంపల్లి క్రిమినల్ కోర్టు భవనంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. కోర్టు భవనం మూడో అంతస్తులో సోమవారం తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైరింజన్‌లతో మంటలను అదుపు చేశారు.

## కీవ్‌పై రష్యా క్షిపణి దాడులు..



అక్షరటుడే, నేషనల్ డెస్క్: నాటో శిఖరాగ్ర సమావేశం సమీపిస్తున్న తరుణంలో, రష్యా ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై భారీ క్షిపణి, డ్రోన్ దాడులతో విరుచుకుపడింది. సోమవారం తెల్లవారుజామున జరిగిన ఈ దాడుల్లో కనీసం 11 మంది ప్రాణాలు కోల్పోగా, 60 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. కీవ్ నగరంలో 10 మంది, బుచా జిల్లాలో ఒకరు మరణించారు.

## రైతులకు నీళ్లు ఇవ్వాలి : కేటీఆర్



అక్షరటుడే, హైదరాబాద్ : తమ మీద కోపం ఉంటే కేసులు పెట్టుకోవాలని, కానీ రైతుల మీద పగ తీర్చుకోవద్దని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో వర్షా లు లేకున్నా కన్నెపల్లి పంప్ హౌస్ దగ్గర లక్ష క్యూసెక్కుల నీళ్ళు సముద్రంలోకి పోతున్నాయన్నారు. రెండు పంపులు ఆన్ చేస్తే కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల రాష్ట్రమంతా నీళ్ళు పారి సుభిక్షం అవుతుందన్నారు.

## ములుగు అభివృద్ధిపై మంత్రి సీతక్క రివ్యూ



**అక్షరటుడే, ములుగు:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలో ములుగు జిల్లాలో పర్యటించనున్నారని, పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నామని మంత్రి సీతక్క తెలిపారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ బోర్కేడ్ హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, డీఎఫ్ఓ వికాస్ మీనా, ఐటీడీఏ పీవో నవీన్ వత్సల్ టొప్పోలతో కలిసి ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా అభివృద్ధికి సంబంధించి పలు కీలక అంశాలపై చర్చించారు. మేడారం అభివృద్ధి పనులు, ఇతర పెండింగ్‌లో ఉన్న పనులను పది రోజుల్లోనే పూర్తి చేయాలని గడువు విధించారు. ముఖ్యమంత్రి పర్యటన తేదీని త్వరలోనే ఖరారు చేస్తామని పేర్కొన్నారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా దాదాపు రూ. 6 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించామని, వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

## 116 ఏళ్ల వృద్ధురాలికి.. శ్రీవారి వీఐపీ దర్శనం



**అక్షరటుడే, ఏపీ :** అలిపిరి మెట్లెక్కిన 116 ఏళ్ల వృద్ధ భక్తురాలు నవనీతమ్మతో పాటు ఆమె కుటుంబ సభ్యులకు టీటీడీ శ్రీవారి ప్రత్యేక వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించింది. అనంతరం రంగనాయకుల మండపంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర వేద పండితులతో వేదాశీర్వచనం చేయించి, పట్టువస్త్రం కప్పి, తీర్థప్రసాదాలు అందజేశారు. తమిళనాడుకు చెందిన నవనీతమ్మ కుటుంబ సభ్యులతో కలిసి మెట్లు ఎక్కి తిరుమలకు వచ్చారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో వారికి వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించాలని టీటీడీ చైర్మన్ ఆదేశించారు. విజిలెన్స్ అధికారులు ఆమె ఆచూకీ కనుగొని సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శనం కల్పించారు.



## జమ్మూ కశ్మీర్‌లో

# క్లౌడ్‌బరస్ట్

జమ్మూ కశ్మీర్‌లో కుండపోత వాన కురిసింది. కిష్త్వార్ జిల్లాలో క్లౌడ్ బరస్ట్‌తో ఒక్కసారిగా భారీ వర్షం పడంతో వరద పోటెత్తింది. దీంతో పలు చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. జాతీయ రహదారి-244పై కొండ చరియలు పడటంతో పాటు, పలు చోట్ల రోడ్డు తెగిపోయింది. దీంతో అధికారులు హైవేను తాత్కాలికంగా మూసివేశారు. వాతావరణం మెరుగుపడి, హైవేలోని ప్రభావిత ప్రాంతం ప్రయాణానికి సురక్షితమని ప్రకటించిన తర్వాత పునరుద్ధరణ, రహదారిని శుభ్రపరిచే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

**- అక్షరటుడే, నేషనల్ డెస్క్**

- కుండపోత వానతో పోటెత్తిన వరద
- విరిగి పడిన కొండచరియలు
- నిలిచిన రాకపోకలు

జమ్మూ కశ్మీర్‌లో క్లౌడ్ బరస్ట్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కిష్త్వార్ జిల్లాలోని 540 మెగావాట్ల క్వార్ జలవిద్యుత్ ప్రాజెక్టు సమీపంలో శిథిలాల కింద అనేక వాహనాలు కూరుకుపోవడంతో, కిష్త్వార్‌దోడా జాతీయ రహదారి (NH244)ని మూసివేయాల్సి వచ్చింది. దట్టమైన బురద, రాళ్లు, శిథిలాల కింద కూరుకుపోయిన అనేక వాహనాలు చిక్కుకుపోయాయి. వాహనాలను వెలికి తీయడానికి, ప్రభావిత ప్రాంతాన్ని పునరుద్ధరించడానికి అధికారులు భారీ యంత్రాలను ఉపయోగించి శిథిలాలను తొలగించే ఆపరేషన్లను ప్రారంభించారు. కిష్త్వార్ జిల్లాలోని చెనాబ్ నదిపై ఉన్న క్వార్ జలవిద్యుత్ ప్రాజెక్ట్, ఈ ప్రాంతపు జలవిద్యుత్ విస్తరణ కార్యక్రమం కింద అభివృద్ధి చేయబడుతున్న 540 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్ట్.

### ట్రాఫిక్ అంతరాయం

ఆకస్మిక వరద, కొండచరియలు విరిగిపడటంతో NH244లోని ప్రేమ్ నగర్ మార్గం మూసుకుపోయింది. దీంతో కిష్త్వార్ -దోడా మధ్య ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. భారీగా పేరుకుపోయిన శిథిలాల కారణంగా రహదారి ప్రమాదకరంగా మారడంతో, పునరుద్ధరణ పనులు ప్రారంభించే వరకు అధికారులు వాహనాల రాకపోకలను నిలిపివేశారు.

### సహాయక చర్యలు

ఈ ఘటనలో ఆస్తి, ప్రాణనష్టానికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో క్వార్ ప్రాజెక్ట్ సైట్‌కు వెళ్లే రహదారిపై కొండచరియలు విరిగిపడ్డాయని అధికారులు తెలిపారు. వాహనాలు, మిల్లులు, ఇతర యంత్రాలు బురద కింద కూరుకుపోయాయి. వాహనాలను బయటకు తీసేందుకు ఎన్డీఆర్ఎప్, ఎస్డీఆర్ఎఫ్, ఆర్మీ సిబ్బంది, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు.

## అయోధ్య రామ మందిరంలో కోట్ల అవినీతి : మంత్రి పొన్నం



**అక్షరటుడే, కరీంనగర్ :** అయోధ్య రామమందిరంలో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దీనికి బాధ్యత వహిస్తూ బీజేపీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అయోధ్యలో రామ జన్మభూమిలో మందిరం నిర్మాణం జరగాలని రాజీవ్ గాంధీ శిల్యాన్ వేశారని మంత్రి గుర్తు చేశారు. మందిరం కోసం ఎంతో మంది డొనేషన్లు ఇచ్చారన్నారు. అయితే విరాళాల సొమ్ములో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపించారు. దీనిని అయోధ్య ప్రజలు ముందుగానే గమనించారన్నారు. అందుకే బీజేపీని అక్కడ ఓడించారన్నారు. అయోధ్యలో విరాళాల చోరీపై బీజేపీ స్పందించాలని, దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

## విదేశీ పర్యటనకు బయలుదేరిన ప్రధాని మోదీ



**అక్షరటుడే, ఢిల్లీ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం విదేశీ పర్యటనకు బయలుదేరారు. 6 రోజుల పాటు ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో ఆయన పర్యటన సాగనుంది. ఈ పర్యటన భారతదేశపు 'యాక్ట్ ఈస్ట్ పాలసీ', 'మహాసాగర్' దార్శనికత, స్వేచ్ఛాయుత, బహిరంగ ఇండోపసిఫిక్ ప్రాంతం పట్ల భారతదేశానికి ఉన్న దృక్పథాన్ని మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని పేర్కొన్నారు. ఇండోనేషియా రాష్ట్రపతి ప్రబోవో సుబియాంటో ఆహ్వానం మేరకు జూలై 6 నుండి 8 వరకు ఆ దేశంలో మోదీ పర్యటించనున్నారు. కాగా ప్రధాని 2018లో తొలిసారి అక్కడ పర్యటించారు. భారత్, ఇండోనేషియాలు నాగరిక, ప్రజల మధ్య సంబంధాలను పంచుకుంటున్నాయని పేర్కొన్నారు. అనంతరం ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో పర్యటిస్తారు.

## అగ్నిపథ్‌లో కీలక మార్పులు..




**అక్షరటుడే, ఢిల్లీ :** అగ్నిపథ్ పథకం ద్వారా దేశ రక్షణలో భాగస్వాములైన అగ్నివీరులకు శుభవార్త. నాలుగేళ్ల పదవీకాలం ముగిసిన తర్వాత, శాశ్వత ప్రాతిపదికన సైన్యంలో కొనసాగే అగ్నివీరుల సంఖ్యను పెంచాలని భారత సైన్యం కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం నిబంధనల ప్రకారం నాలుగేళ్ల శిక్షణ అనంతరం కేవలం 25 శాతం మంది అగ్నివీరులకు మాత్రమే శాశ్వత ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. ఈ సంఖ్యను 50 శాతానికి పెంచాలని ఆర్మీ, వాయుసేనలు యోచిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. మరోవైపు, భారత నౌకాదళం తన అగ్నివీరులలో ఏకంగా 75 శాతం మందిని శాశ్వత ప్రాతిపదికన రిటైన్ చేసుకోవడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది.

## ప్రజలే ఆట ముగిస్తారు : ప్రకాశ్‌రాజ్



**అక్షరటుడే, ఏపీ :** ప్రముఖ యూట్యూబర్ ప్రశ్న రావణ్‌పై ఉపా వంటి కఠినమైన చట్టాలను ప్రయోగించడంపై నటుడు ప్రకాష్ రాజ్ తీవ్రస్థాయిలో స్పందించారు. ప్రశ్న రావణ్‌పై ప్రభుత్వం వరుసగా తప్పుడు కేసులు బనాయిస్తోందని మండిపడ్డారు. ఇప్పటికే కోర్టు ఈ కేసుల్లో అతనికి బెయిల్ మంజూరు చేసినా, తాజాగా ఉపా చట్టాన్ని ప్రయోగించి మళ్ళీ రిమాండ్‌కు పంపడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రశ్నించినందుకు దేశద్రోహం కింద పరిగణిస్తారా? అహా.. జస్ట్ ఆస్కింగ్ అంటూ తనదైన శైలిలో సెటైర్లు వేశారు. "ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు గారితో మొదలైన మీ ఆటలకు ముగింపు ప్రజలే ఇస్తారు" అని హెచ్చరించారు.

## ముంబై–పుణె రైల్వే ట్రాక్‌పై విరిగిపడ్డ కొండచరియలు



**అక్షరటుడే, ముంబై:** మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. కర్జత్‌లోనావాలా భోర్ ఘాట్ ప్రాంతంలో భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడటంతో ముంబై పుణె రైలు మార్గంలో సోమవారం తెల్లవారుజామున రైలు సేవలను నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. ఘాట్ ప్రాంతంలోని ఠాకుర్‌వాడి సమీపంలో ఒక కొండచరియ విరిగిపడగా, ఖండాలా, మంకీ హిల్ మధ్య మార్గంలో తెల్లవారుజామున 3.05 గంటల ప్రాంతంలో మరొకటి విరిగిపడింది. దీంతో మూడు రైల్వే లైన్లు ప్రభావితమయ్యాయి. దీంతో రైల్వే అధికారులు పలు రైళ్లను రద్దు చేశారు. మరికొన్నింటిని దారి మళ్లించారు. వర్షాలతో పలు రోడ్లు కూడా ధ్వంసం అయ్యాయి. సోమవారం పుణేముంబై ఎక్స్‌ప్రెస్‌వే, పాత పుణేముంబై హైవేపై ట్రాఫిక్‌ను నిలిపివేశారు. తదుపరి ఆదేశాలు జారీ అయ్యేవరకు ఈ మార్గాల్లో ప్రయాణం చేయొద్దని అధికారులు పేర్కొన్నారు.

## త్వరలో పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్




**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్రంలో పోలీస్ ఉద్యోగాల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ వెలువడనుంది. ఈ మేరకు ప్రభుత్వం పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు అనుమతి ఇచ్చింది. రాష్ట్రంలో 5 వేల పోలీస్ ఉద్యోగాల భర్తీకి ఇటీవల ప్రభుత్వం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. అయితే ఉద్యోగాల సంఖ్యను పెంచాలని నిరుద్యోగులు ఆందోళన చేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ప్రభుత్వం 7 వేల పోస్టుల భర్తీకి అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నోటిఫికేషన్ విడుదల చేయడానికి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చర్యలు చేపట్టింది. సబ్ ఇన్‌స్పెక్టర్ (సివిల్) 148, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఆర్) 14, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ (టీజీఎస్పీ) 12, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఏఆర్‌సీపీఎల్) 3, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎఫ్‌పీబీ) 23, పోలీస్ కానిస్టేబుల్ (సివిల్) 3,697, పోలీస్ కానిస్టేబుల్ (ఏఆర్) 1,052, పోలీస్ కానిస్టేబుల్ (ఎస్ఏఆర్‌సీపీఎల్) 24, పోలీస్ కానిస్టేబుల్ (డ్రైవర్) పీటీవో 20, పోలీస్ కానిస్టేబుల్ (మెకానిక్) పీటీవో 7 పోస్టులను భర్తీ చేయనున్నారు. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ 39, ఫైర్ ఫైటర్స్ 751 పోస్టులు, డిప్యూటీ జైలర్ (మెన్) 14, ఉమెన్ 1, వార్డెన్ (మెన్) 196, వార్డెన్ (ఉమెన్) 12, ప్రత్యేక రక్షణ దళంలో 44 ఎస్సై, 1,380 కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయనున్నారు.